సిసి రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని రాప పంచాయితీ కోటగరువు గ్రామంలో ఎంపీపీ రాజుబాబు, వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, రాప ఎంపీటీసీ కోరాబు నాగలక్ష్మిలు సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, 15 వ ఆర్థిక సంఘం నిధుల నుండి రూ 10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం చేయడం జరుగు తుందన్నారు. త్వరగా సిసి రోడ్ల నిర్మాణానికి పనులు ప్రారంభించాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించి సిసి రోడ్లు నిర్మాణం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ సభ్యులు ముత్యంగి విశ్వేశ్వరరావు, రాము పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు

గిరిజన విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆందోళన

వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థులు

ప్రజాశక్తి-పాడేరు :గిరిజన విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, బకాయి ఉపకార వేతనాలు చెల్లించాలని, మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం పలు కళాశాల పాఠశాలల విద్యార్థులు అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐటీడీఏ వద్దకు చేరుకొని గేటు ముందు బైఠాయింపు జరిపి ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించాలని, ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ చార్జీలు 3 వేలకు పెంచాలని విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.కార్తీక్ శ్రీను, పి.జీవన్‌కృష్ణ మాట్లాడుతూ, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, బి-ఫార్మసీ వంటి ఉన్నత మైన విద్యలో పెండింగ్‌లో ఉన్నటువంటి ఫీజు రియంబర్స్మెంట్ దాదాపుగా 3480 కోట్లు రూపాయల బకాయిలు ఉన్నాయన్నారు.అధికారంలోకి రాకముందు యువగళం పాదయాత్రలో అధికారంలో వస్తే నెల రోజుల్లో ఫీజు రీయంబర్స్మెంట్ విడుదల చేస్తామని చెప్పిన ప్రస్తుత విద్యాశాఖ మంత్రి లోకేష్ ఈ విషయమై మాట్లాడటం లేదని విమర్శించారు. ఇప్పటికి కొన్ని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం పెండింగ్‌లో ఉన్న మొత్తం డబ్బు చెల్లించాలని విద్యార్థులకు ఒత్తిడి చేస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం ఆ డబ్బులు జమ చేయడం లేదన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి పెండింగ్లో ఉన్న రీయంబర్స్మెంట్‌ను విడుదల చేయాలని, ప్రభుత్వం స్పందించకపోతే నవంబర్ 6వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. పేద మధ్యతరగతి కుటుంబాలకు సంబంధించిన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్నారని గత ప్రభుత్వం మధ్యాహ్న భోజనం రద్దు చేసిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం పున: ప్రారంభిస్తామని ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం ప్రారంభించాలని డిమాండ్ చేశారు. హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలన్నారు.పీజీ చదివే ప్రతి విద్యార్థికి ఫీజు రీయింబర్స్మెంట్ వర్తింపజేసేలా చూడాలని, అర్హత కలిగిన ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం వచ్చే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో హెల్త్ వాలంటీర్‌లను నియమించాలని, గిరిజన విద్యార్థుల మరణలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి.చిన్నారావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.చినబాబు, పి. సింహాద్రి, నాయకులు పి.వరహాలబాబు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థులు

సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

మాతాశిశు మరణాల నివారణకు చర్యలు

- ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలో మాతా శిశు మరణాలు సంభవించకుండా మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. ఏజెన్సీలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఆర్ఎంపీలు, పీఎంపీలు, ఫార్మసిస్టులతో స్థానిక ఐటిడిఏ సమావేశ మందిరంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ సింహాచలం మాట్లాడుతూ మాతా శిశు మరణాల సంభవించకుండా వైద్యాధికారులు, సిడిపిఓలతో ప్రతి మంగళవారం కన్వర్జెన్సీ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా మాతృ మరణాలు, శిశు మరణాలు సంభవిస్తే సంబంధిత వైద్యాధికారులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ సెలవులు రోజుల్లో వైద్యాధికారులు, సిబ్బంది ప్రజలకు వైద్య సేవల కొరకు అందుబాటులో ఉండాలన్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి ఆయా వ్యాధులకు ఉచిత మందులు అందజేయాలని సూచించారు. ఫీవర్ కేసులు సంభవించకుండా డోర్ టు డోర్ సర్వే చేయాలన్నారు. ఏజెన్సీలోని ఆర్ఎంపీలు, పీఎంపీలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వైద్య సేవలు అందించాలని, వారికి తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతులు ఉండాలని, లేకుంటే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తీవ్ర వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు తెలియజేయాలన్నారు. ఫీవర్ కేసులు లేకుండా ఆర్ఎంపీలు పీఎంపీలు ప్రభుత్వ వైద్యాధికారులకు సహకరించాలని కోరారు. ఆర్ఎంపి సిల్వర్ స్టార్ మాట్లాడుతూ ఆర్ఎంపిలకు, పీఎంపీలకు వైద్యాధికారులతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయాలని, ప్రజలు ఆరోగ్యంగా ఉండే విధంగా కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎడిఎంహెచ్ఓ జి.శిరీష, వైద్యాధికారులు రాధిక, భావన, హరికృష్ణ, సాయి రతన్, వినోద్, సుజాత, షామిన్, నాయక్, నాగార్జున, జ్యోతిర్మయి, ఎంపీహెచ్ఓ పీటర్, అన్ని మండలాలకు సంబంధించిన ఆర్ఎంపీలు, పీఎంపీలు పాల్గొన్నారు.

జిఒ 3కి చట్టబద్ధత కల్పించిన తర్వాతనే..

పోస్టులను భర్తీ చేయాలి

సిపిఎం నాయకులు సురేంద్ర, అప్పలనర్స

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స, చిత్రంలో సురేంద్ర

ప్రజాశక్తి- పెదబయలు:జిఒ 3 కు చట్టబద్ధత కల్పించిన తర్వాత మెగా డీఎస్సీ ప్రకటించాలని, అలాగే ఇతర శాఖల్లో ఖాళీలను భర్తీ చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సురేంద్ర, జిల్లా కార్యదర్శి అప్పలనర్స డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సిపిఎం కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ 7వ మహాసభ సీనియర్ నాయకుడు కిలో శరబన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డిఎస్సీ నోటిఫికేషన్‌కు ముందే ఆదివాసీలకు నూరు శాతం రిజర్వేషన్ ప్రకటించాలని డిమాండ్ చేసారు.ఆదివాసీ స్పెషల్ డిఎస్సీ ద్వారానే ఏజెన్సీలో టీచర్ పోస్టుల భర్తీ చేయాలన్నారు. డిసెంబర్ 2 నుండి 5 వరకు జరిగే సి.పి.ఎం పార్టీ జిల్లా ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. జనరల్ డిఎస్సీ ద్వారా టీచర్ పోస్టులు భర్తీ చేస్తే ఆదివాసి నిరుద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. ఆదివాసీ చట్టాల పరిరక్షణకు ప్రభుత్వం చిత్తశుద్ధి గా పని చేయాలన్నారు. నూరు శాతం రిజర్వేషన్ కల్పనకు అధికారం లోకి వచ్చిన వెంటనే చేపడతామని అరకు ఎన్నికల సభలో హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ప్రకటన చేయకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. జిఒ 3 రిజర్వేషన్ సాధనకు ఆదివాసీలు పోరాటం చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇప్పటికే కే,జీ,బీ,వీ, ఏకలవ్య గిరిజన గురుకుల విద్యా సంస్థలో ఇతర టీచర్స్‌తో పోస్టుల భర్తీ చేయడంతో ఆదివాసి నిరుద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. ఆదివాసి రిజర్వేషన్ సాధనకు సిపిఎం పోరాటం నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి సన్నిబాబు, మండల కమిటీ సభ్యులు గంగాధరం, శర్బన్న, బుజ్జిబాబు, నరసయ్య, సునీల్, రామారావు పాల్గొన్నారు.

రోగులకు సకాలంలో వైద్యమందించాలి

-డిఐఒ సాధన

ప్రజాశక్తి-హుకుంపేట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఓ) డాక్టర్ సాధన ఆకస్మిక తనిఖీలు మంగళవారం చేపట్టారు. ముందుగా రికార్డులు తనిఖీ చేసి ఇమ్యునైజేషన్ ప్రోగ్రాంలో పిల్లల టీకాలు ఏ విధంగా వేస్తున్నారో వాటి విషయాలపై ఆరా తీశారు. అనంతరం స్థానిక వైద్యాధికారి అందిస్తున్న వైద్య సేవలను సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిఐఓ డాక్టర్ సాధన మాట్లాడుతూ, రోగులకు సకాలంలో వైద్యం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. టీబీ వ్యాధి అరికట్టాలంటే 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ టీకాను వేసుకోవాలని తెలిపారు. టీబీ ప్రాణాంతకమైన వ్యాధి కాదని వ్యాధిపై అపోహలు విడనాడాలని ఆమె అన్నారు. రోగిగ్రస్తులు మందుల వాడటంతో వ్యాధిని నివారించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిబి కోఆర్డినేటర్ శేషగిరి వెంకటేశ్వర్లు, సూపర్వైజర్ సదానందం, ల్యాబ్ సూపర్వైజర్ నాగేష్ దొర, కోఆర్డినేటర్ ధనరాజ్, పాల్గొన్నారు.

ఆసుపత్రిని పరిశీలిస్తున్న డిఐఒ సాధన

నేడు వారపు సంత ఆశీలుకు వేలంపాట

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు మండలంలోని డౌనూరు పంచాయతీ కేంద్రంలో ఈనెల 30వ తేదీన వారపు సంతలో ఆశీలు వసూలుకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ పొట్టిక భవానీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఉదయం 11.30 గంటలకు వేలంపాట నిర్వహిస్తామని, ఆసక్తి గల వారు వేలంపాటలో పాల్గొనాలని కోరారు. వేలంపాటకు సంబంధించిన మరిన్ని వివరాలకు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి చర్యలు

ప్రజాశక్తి-పాడేరు: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వము ఇచ్చిన ఆదేశాల మేరకు అర్హులైన పేద కుటుంబాలకు సంవత్సరానికి 3 సిలిండర్లు ఉచితంగా అందజేయనున్నట్లు అల్లూరి సీతా రామరాజు జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు . గ్యాస్ కనెక్షన్, .ఆదార్, .బియ్యము కార్డ్ కలిగి ఉండాలన్నారు.అర్హులైన లబ్దిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీ చేయబడుతుందని వెల్లడించారు. 29.10.2024 నుండి గ్యాస్ కొరకు బుకింగ్ చేసుకొనవచ్చు నని తెలిపారు. గ్యాస్ బుకింగ్ చేసిన లబ్దిదారులు ముందుగా సొమ్ము చెల్లించి గ్యాస్ సిలిండర్ పొందవచ్చని తదుపరి 24 గంటల నుండి 48 గంటల లోపు లబ్దిదారుల బ్యాంక్ ఖాతాలో నగదు జమ అవుతుందన్నారు. గ్యాస్ ఏజెన్సీల వద్ద మొదటి సిలిండర్ కోసం బుక్ చేసుకోనవచ్చునని తెలిపియున్నారు. ఈ విషయమై ఎటువంటి సమస్యలు ఉన్న (గ్రీవెన్స్) లో పిర్యాదు చేసుకునే వెసులబాటు కల్పిస్తున్నారని తెలిపారు.

దగ్గరుండి విద్యుత్ స్తంభాలను వేయిస్తున్న సర్పంచ్ నాగమణి

సర్పంచ్ చొరవతో విద్యుత్ స్తంభాలు పునరుద్ధరణ

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని పెద్ద ఆర్కూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రేపాకలో పంచాయతీ సర్పంచ్ నాగమణి చొరవతో విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించారు. రేపాకలో శబరి ఒడ్డు వద్ద విద్యుత్ మోటార్ల నిమిత్తం విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. ఇటీవల వరదలలో కొన్ని విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. దీంతో మోటారుపై ఆధారపడే ఆయకట్టు రైతులు సాగునీటి సమస్య రావడంతో వారు సమస్యను సర్పంచ్ నాగమణి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆమె విద్యుత్ డివిజన్ అధికారులతో మాట్లాడారు. విరిగిపోయిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి స్పందించిన విద్యుత్ అధికారులు మంగళవారం విరిగిపోయిన పోల్స్ స్థానంలో కొత్త పోల్స్ ఏర్పాటు చేశారు. విద్యుత్ అధికారులకు సర్పంచ్ నాగమణి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

అన్ని రంగాలలో అభివృద్ధి : కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు విజన్ -2047కు అనుగుణంగా అన్ని ప్రభుత్వ శాఖలూ ఆయా రంగాలలో ఏడాదికి 15 శాతం వృద్ధి సాధించే దిశగా ప్రణాళికాయుతంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుండి మండల స్థాయి విసి నిర్వహించిన కలెక్టర్ మాటాడుతూ, మండల స్థాయిలో జివిఎ సాధనకు కృషి చేయాలని, అందుకు తగ్గ ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. పశు భీమా, వాక్సినేషన్, డివార్మింగ్ చర్యలపై ఆరా తీసారు. పశు సంపద పెరగాలని, వాటి ఉత్పత్తులు పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నర్సరీల ఏర్పాటుతో వృద్ధి రేటు పెరుగుతుందని, ప్రస్తుతమున్న విస్తీర్ణాన్ని పెంచడం, కొత్త మొక్కలు వేయడంతో పాటు ఎన్ ఆర్ ఇ జి ఎస్ ద్వారా తోటల పెంపకాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. కొన్ని మండలాలలో రెండు మూడు ఎకరాలు పెంచే యోచనలో ఉన్నారని, అందుకు ఉద్యాన శాఖ ఎందుకని మండి పడ్డారు. జాబ్ కార్డులు లేని వారికి మంజూరు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థలను ఆయా సచివాలయాలకు అనుబంధంగా ఉన్న గదులను కేటాయించాలని, అన్ని సహకార సంస్థల వివరాలను పూర్తిగా కంప్యూటరైజ్ చేయాలని ఆదేశించారు. కాలువలు, గెడ్డలు గుర్తించి అందులో చేపల పెంపకాన్ని చేపట్టాలని సూచించారు. కమ్యూనిటి పరంగా రిజర్వాయర్లలో చేపల పెంపకానికి చర్యలు తీసుకోవాలని, వాటర్ బాడీల వినియోగంపై మత్స్యకారులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సిపిఒ ఎస్ఎస్ఆర్కే పట్నాయక్, పశు సంవర్ధక, వ్యవసాయ, ఉద్యాన, మత్స్య శాఖల అధికారులు జే.నరసింహులు, ఎస్బిఎస్ నంద్, రమేష్ కుమార్ రావు, శ్రీనివాసరావు, డ్వామా పిడి ఎం.శివయ్య, డిపిఓ లవరాజు, డివిజినల్ పిఒ విఎస్ కుమార్, రంపచోడవరం నుండి ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పాల్గొన్నారు.

వాలంటీర్లకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:-మండల కేంద్రంలోని కళ్యాణ మండపం వద్ద మంగళవారం వాలంటరీల యూనియన్ మండల అధ్యక్షులు గొల్లోరి దేవ అధ్యక్షతన సిఐటియు ఆధ్వర్యంలో గ్రామ వాలంటీర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి కొర్ర శంకర్ రావు మాట్లాడుతూ, వాలంటీర్లకు బకాయి పడ్డ 5 నెలల గౌరవ వేతనం చెల్లించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేర్చి, నెలకు 10000 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. బలవంతంగా రాజీనామా చేసిన వాలంటీర్లకు కొనసాగించాలని డిమాండ్ చేశారు .గత ప్రభుత్వం వాలంటీర్స్ కు చట్ట బద్దత కల్పించక పోవడంతో తీవ్ర నష్టం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వాలంటీర్లను కొనసాగించి వారి సేవలను వాడుకుంటామన్న చంద్రబాబు హామీ ఏమైందన్నారు.

మాట్లాడుతున్న వాలంటీర్లు, నాయకులు

గిరిజన సంఘం మండల అధ్యక్షులు ఎంఎం శ్రీను మాట్లాడుతూ, పోరాడి వాలంటీర్లు ప్రభుత్వ హామీ సాధించుకోవాన్నారు.వాలంటీర్స్‌కు న్యాయం చేయకపోతే ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ప్రభుత్వా నికి హెచ్చరించారు. ఈ సదస్సులో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొర్ర శంకర్రావు , మండలం ఉపాధ్యక్షులు పాంగి భీమరాజు , మండల కమిటి సభ్యులు నర్సింగ్ పడాల్, గాసిరామ్ దొర, త్రినాద్, వాలంటీర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ప్రసాద్, జిల్లా ఉప అధ్యక్షులు చిన్నయ్య, అల్లూరి జిల్లా మహిళా అధ్యక్షురాలు కొండమ్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి బర్లు కొండబాబు, పాడేరు మండల అధ్యక్షులు సురేష్ కుమార్, మండల వాలంటీర్ల మహిల అధ్యక్షురాలు మంతం అన్న పూర్ణ, నాయకులు భాను మూర్తి, హనుమంతు, కిరణ్ ,జయరామ్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల భోజనాల బాధ్యత అక్షయపాత్రకు అప్పగిస్తే ప్రతిఘటన తప్పదు

సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి-సీలేరు

ఏజెన్సీలోని ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు భోజనాలు వండివడ్డించే బాధ్యత అక్షయపాత్ర స్వచ్ఛంద సంస్థకు అప్పగిస్తే ఊరుకొనేది లేదని, ఉద్వేత్తిన ఉద్యమానికి సిద్ధమవుతామని సిపిఎం పాడేరు జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్యపడాల్ హెచ్చరించారు. మంగళవారం జరిగిన సిపిఎం జీకే.వీధి మండల కమిటీ సమావేశానికి హాజరైన వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల భోజన సౌకర్యాలు అక్షయపాత్రకు అప్పగించడం అంటే పిల్లలకు పెట్టే భోజనాలు ప్రైవేట్ వాళ్ళు చేతుల్లో పెట్టడమేనని పేర్కొన్నారు. హాస్టళ్లలో వేడివేడిగా అప్పుడే వండి భోజనాలు సమకూర్చుతున్నా అనేక ఆరోగ్య సమస్యలు విద్యార్థులకు వస్తున్నాయని, అలాంటిది అక్షయపాత్ర ఎక్కడో తయారు చేసిన భోజనాలు బండి ద్వారా హాస్టల్‌కు తీసుకొచ్చి విద్యార్థులకు పెడితే ఆ భోజనాల ఏదైనా జరిగితే దాని బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. అలాగే వార్డెన్లు, హాస్టల్‌లో పని చేసే క్యాజువల్, డైలీవేజ్, పర్మినెంట్ కార్మికుల సంగతేమిటిని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేకుంటే విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స

ఎర్రమట్టి తవ్వకాలకు అనుమతులు ఎవరిచ్చారు?

గిరిజన చట్టాల ప్రకారం ఏజెన్సీలో మైనింగ్‌కు పీసా గ్రామసభలో తీర్మానం చేయాలని, జీకే.వీధి మండలం చాపరాతి పాలెంలో పంచాయతీ తీర్మానం లేకుండా ఎర్రమట్టి తవ్వకాలకు అనుమతులు ఎవరిచ్చారో ప్రభుత్వం గిరిజనులకు సమాధానం చెప్పాలని అప్పలనర్స, చిన్నయ్యపడాల్ డిమాండ్ చేశారు. ఆర్‌వి.నగర్ నుండి సీలేరు వరకు రహదారి చాలా అధ్వానంగా ఉందన్నారు. గిరిజన మంత్రి జీకే వీధి మండలంలో పర్యటించినప్పుడు రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని, ఆ హామీని ఎప్పుడు అమలు చేస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జీకే వీధి మండల కార్యదర్శి అంపరంగి బుజ్జిబాబు, నాయకులు గడుతూరి సత్యనారాయణ, కొర్ర బాలయ్య, అమ్మవారి దారకొండ సర్పంచ్ చంటిబాబు, సిపిఎం చింతపల్లి మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

కల్లేరుకు మినరల్ వాటర్ సరఫరా పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-చింతూరు : ప్రభుత్వం ఎర్రంపేట కేంద్రంగా మినరల్ వాటర్ ప్లాంట్ నుండి రక్షిత నీటి సరఫరాను కల్లేరు గ్రామానికి పునరుద్ధరించాలని సిపిఎం కల్లేరు గ్రామశాఖ మహాసభ డిమాండ్ చేసింది. ఎర్రంపేట మినరల్ వాటర్ ప్లాంట్ నుండి గతంలో నీటి సరఫరా ఉండేదని, జాతీయ రహదారి నిర్మాణం ప్రారంభమైన తర్వాత ఆ పైప్ లైన్ కట్ చేయడంతో సంవత్సర కాలంగా మినరల్ వాటర్ సరఫరా ఆగిపోయిందని, దీంతో కల్లేరు గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. అధికారులు తక్షణమే స్పందించి కల్లేరు గ్రామానికి మినరల్ వాటర్ సరఫరాను పునరుద్ధరించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. అలాగే కొమ్మయగుంపు రోడ్డు మరమ్మతులు చేయాలని, బోరుగుంపు రోడ్డు నిర్మాణం చేపట్టాలని, కాలనీ గుంపులో సోడి వీరయ్య ఇంటి ఏరియాలో చేతి పంపు వేయాలని మహాసభలో తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పల్లపు వెంకట్, మండల కార్యదర్శి సీసం సురేష్, నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాస్, గ్రామ నాయకులు సోడి రెడ్డి, సోడి రాఘవయ్య, కారం సుబ్బారావు, కారం శ్రీరాములు, కుంజా నారాయణ, పొడియం నరేష్, సోడి చిన్నమ్మి, సోడి గంగయ్య, సోడి మార్కమ్మ, సోడి రాములమ్మ, సోడి కమల, సోడి దూలయ్య, సోడి గంగరాజు, కుంజా సురేష్, కుంజా లక్సయ్య, కుంజా బాబురావు, సోడి జయ తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి పంచాయతీ పరిధి రేఖపల్లి గ్రామంలో రూ.5లక్షలతో సాయిబాబా గుడి నుండి 143 మీటర్ల మేరకు చేపట్టిన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ఎంపిపి కారం లక్ష్మి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా ఏ అభివృద్ధి జరగలేదని, రోడ్లన్నీ గోతులతో దారుణంగా ఉన్నాయని పేర్కొన్నారు. రహదారులు సరిగ్గా లేక ప్రజల ఇబ్బందులు పడుతున్నారని, వర్షాలు వచ్చినప్పుడు రహదారిపై నడవాలంటే నరకప్రాయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి అధికారులతో మాట్లాడి సిసి రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రోడ్డు నిర్మాణం నాణ్యతగా, సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్, సిపిఎం మండల నాయకులు పంకు సత్తిబాబు, పోడియం శ్రీరామ్మూర్తి, హాజరత్, వడ్లది రమేష్, కారం సుందరయ్య, సీనియర్ నాయకులు వీర్ల నాగేశ్వరరావు, జి.లక్ష్మణరావు, ప్రకాష్ రావు, గ్రామ ప్రజలు గంగాభవాని, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపిపి కారం లక్ష్మి

మాట్లాడుతున్న జడ్‌పిటిసి గంగరాజు

విద్యార్థుల ఉన్నత చదువుకు కృషి చేయాలి

జడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి- అనంతగిరి:ప్రభుత్వ ఆశ్రమోన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న గిరిజన విద్యార్థిని. విద్యార్థుల. ఉన్నత చదువుకై కృషి చేయాలని స్థానిక జెడ్పిటిసి దీసరి గంగరాజు సూచించారు. మండలంలో మారుమూల జీనాబాడు బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో మంగళవారం ఆయన సందర్శించారు. పాఠశాల హాస్టల్ వసతి, ఉపాధ్యాయుల తదితర సమస్యలపై తొమ్మిది. పదో తరగతి విద్యార్థులతో. సమావేశమై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినిలు మాట్లాడుతూ, హాస్టల్ వసతి సౌకర్యం సరిపోలేదని, తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, ఇంగ్లీష్ టీచర్ లేరని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. ఈ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. 20 లక్షలతో నిర్మించిన అదనపు హాస్టల్ వసతి భవనాన్ని పాఠశాల హెచ్‌ఎం మల్లేశ్వరి తో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బీటి దొర, తదితరులు పాల్గొన్నారు

నైపుణ్యాభివృద్ధితో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి -పాడేరు:నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి రోహిణి పేర్కొన్నారు. పాడేరు డివిజన్ ఫరిదిలోని మాస్టర్ ట్రైనీలకు శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా రోహిణి మాట్లాడతూ, స్కిల్ సెన్సెస్ సర్వే ఇప్పటికే గుంటూరు జిల్లాలో పూర్తి చేయడం జరిగిందని వివరించారు. ఇందులో భాగంగా జిల్లాలో సర్వే చేబట్టే ఎన్యుమరేటర్లకు శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. క్షేత్రస్థాయిలో సచివాలయాన్ని యూనిట్గా తీసుకుని, ఒక్కో క్లస్టర్కు ఒక ఎన్యుమరేటర్ను నియమించి సర్వే నిర్వహించబడుతుందని తెలిపారు. ప్రతి ఎన్యుమరేటర్కు నిర్దిష్ట కుటుంబాలను మ్యాపింగ్ చేయడం జరుగుతుందని తెలిపారు.

సర్పంచ్ కాంతమ్మ మృతి

ప్రజాశక్తి - చింతపల్లి :- మండలంలోని కుడుముసారి పంచాయతీ సర్పంచ్ బోండా కాంతమ్మ సోమవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. గడచిన వారం రోజులుగా అనారోగ్యానికి గురై విశాఖలో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం పరిస్థితి విషమించి మృతి చెందారు. పాడేరు మాజీ శాసన సభ్యురాలు, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి, చింతపల్లి ఎంపీపీ కోరాబు అనూష దేవి, జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షురాలు దురియా పుష్పలత, మండల కన్వీనర్ పాంగి గణబాబులు కాంతమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

రైతుల తలసరి ఆదాయం పెంపునకు ప్రణాళికలు

-జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు: జిల్లాలో దేశీయ వ్యవసాయ ఉత్పాదకత పెంపునకు ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. రైతుకు వ్యవసాయానుబంధ రంగాలలో రైతుల తలసరి ఆదాయం పెరగాలని స్పష్టం చేసారు. రైతులు ఆర్థికంగా అభివద్ధి చెందాలన్నారు. రైతుల ఆదాయం పెంచడానికి వ్యవసాయానుబంధ శాఖలు కృషి చేయాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక శాఖ, మత్స్య, సెరీ కల్చర్ అధికారులతో మంగళవారం ఆయన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో రైతుల తలసరి ఆదాయం, సాగులో ఉన్న భూముల వివరాలను అధికారులను అడిగి తెలుసు కున్నారు. వ్యవసాయానికి అనువుగా ఉన్న భూములను గుర్తించాలన్నారు. రైతులను రైతు ఉత్పత్తిదారుల సంఘాలలో చేర్పించాలన్నారు. జిల్లా లో మూడు మండలాలను ఎంపిక చేసి వ్యవసాయ పంటలు, ఉద్యానవనాలు, పశు సంపదపై సర్వే చేయాలని సూచించారు. వ్యవసాయానుబంధ శాఖలు సమన్వయంతో రైతులు పొందుతున్న వార్షిక ఆదాయం రానున్న ఐదేళ్లలో రెండింతల పురోగతి సాధించడానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయాలన్నారు. మండలాన్ని జోన్గా విభజించి శాంపిల్ సర్వే చేయాలని చెప్పారు. సర్వే క్రమంలో బౌగోళిక వాతావరణ పరిస్థితులు, నీటి పారుదల సౌకర్యాలు, సంస్థాగత ఆర్థిక పరిస్థితులు, ప్రగతిశీల రైతులు, సామాజిక వర్గం, వ్యవసాయ భూముల రకాలను గుర్తించాలని చెప్పారు. రైతులందరిని ఒకే గొడుగు కింద ఉండే విధంగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలలో చేర్పించాలని స్పష్టం చేసారు. ఈ సమావేశంలో సిపిఓ ఎస్ఎస్. ఆర్. కె.పట్నాయక్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి. ఎస్.నంద్, జిల్లా ఉద్యానవన అధికారి పి.రమేష్ కుమార్‌రావు, పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు నరసింహులు, సెరీకల్చర్ సహాయ సంచాలకులు అప్పారావు, డి. ఎస్.ఓ. వెంకటరావు మత్స్యశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అంకితభావంతో పనిచేయాలి

- మండల సమావేశంలో జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర
- గిరిజనుల సమస్యలపై సభ్యుల గళం

సమస్యలను ప్రస్తావిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు :మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో శ్రీ సాయి హర్ష ఆధ్వర్యంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లా జడ్పీ ఛైర్పర్సన్ సుభద్ర హాజరయ్యారు. వైద్యశాఖ పనితీరుపై జడ్పీ ఛైర్ పర్సన్ సమీక్ష నిర్వహించారు. సి హెచ్ సిలో చేరిన రోగులపై వైద్యులు చులకన భావంతో వ్యవహరిస్తున్నారని, సోదర భావంతో వైద్యం చేసే మనసుతో అంకిత భావం కలిగి ఉండాలన్నారు. మండలంలో పివిటిసిల, ఎన్టీఆర్ గృహాల బకాయిలు పై నివేదికను జడ్పీ ఛైర్ పర్సన్ కోరారు. హౌసింగ్ అధికారులు లంచాలకు పాల్పడుతున్నారని హెచ్చరించారు.

మండల వైస్ ఎంపీపీ 1 పాటు బోయి సత్యనారాయణ మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యాభ్యాసం కుంటి పడుతోందన్నారు. ఆదివాసి గిరిజన విద్యార్థుల మృతి, ఉపాధ్యాయుల దురుసు ప్రవర్తన పై ఆగ్రహించారు. మండల పరిధిలో వివిధ పాఠశాలల్లో తరచూ విద్యార్థులు మృతి చెందుతున్నా విద్యాశాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువైందన్నారు.

లక్ష్మీపురం సర్పంచ్ (సిపిఎం) కొర్ర త్రినాథ్ మాట్లాడుతూ, మండలంలో ఇటీవల కురిసిన వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పంచాయతీరాజ్ నిధులతో రోడ్ల పనులు వేగవంతం చేయాలన్నారు. వర్షాలకు కొట్టుకు పోయిన రోడ్లు, వంతెనలు, బ్రిడ్జిలపై నివేదిక సమర్పించాలని జెడ్పి ఛైర్‌పర్సన్ సూచించారు. పీవీటీజీల గృహాల మంజూరు పై నివేదిక కోరారు. జల్ జీవన్ మిషన్ నిధులు మండలంలో సుమారు 50 కోట్లు మంజూరు అయినప్పటికీ పనులు పూర్తి కాలేదని ప్రస్తుతం కేవలం సుమారు 5 కోట్లు మాత్రమే నిధులు ఖర్చుయ్యిందని ప్రజాప్రతినిధులు వెల్లడించారు. జల్ వన్ మిషన్ పనులు వేగవంతం చేసి ఇంటింటికి కులాయిలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజా ప్రతినిధులు డిమాండ్ చేశారు.జర్రెల సర్పంచ్ బొరగం భాగ్యవతి మాట్లాడుతూ, జడ్పీ ఛైర్పర్సన్, ఎంపీపీ నిధులు పంపిణీలో జాప్యం జరుగుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు మండల స్థాయిలో బస చేసి విధులు నిర్వహించాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని అధికారులకు జెడ్‌పి ఛైర్‌పర్సన్ హెచ్చరించారు. మధ్యాహ్నం వీడియో కాన్ఫరెన్స్ మండల అధికారులకు ఉండడంతో సర్వసభ్య సమావేశంలో ఖాళీ కుర్చీలు దర్శనం ఇచ్చాయి. మధ్యాహ్నం తూతు మంత్రంగా సర్వసభ్య సమావేశాన్ని ముగించారు. ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి

ప్రజాశక్తి - అరిలోవ : టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని అపోలో హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ పిఆర్‌కె.ప్రసాద్ సూచించారు. అజాగ్రత్తగా ఉంటే ప్రమాదాలకు ఆస్కారం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ పండగ సమయంలో కాలిన గాయాల కేసులు అధికంగా పెరుగుతున్నాయని, తక్షణ ప్రథమ చికిత్సతో తగ్గించవచ్చని తెలిపారు.

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్ బోల్తాపడి ఒకరు మృతి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని కొర్రాయి పెదఅంజోడ గ్రామంలో ట్రాక్టర్ బోల్తాపడి ఒకరు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానిక ఎస్సై పాపినాయుడు తెలిపిన వివరాలు... పెదఅంజోడ గ్రామానికి చెందిన పాంగి ప్రసాదరావు(26) అనే గిరిజనుడు మంగళవారం ఉదయం ట్రాక్టర్‌తో పొలం దుక్కు పనులకు వెళ్లాడు. దుక్కులు చేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడింది. క్షతగాత్రుడిని కుటుంబీకులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందారని చెప్పారు. మృతదేహాన్ని అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించిచి కుటుంబీకులకు అప్పగించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న జమాల్‌భాషా

మాతాశిశు మరణాలను నియంత్రించాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జమాల్ బాషా

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలో ఉప్ప, బాకూరులో ఆరోగ్య కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జమాల్ భాషా మంగళవారం సందర్శించారు. బాకూరు ఆరోగ్య ఉప కేంద్రం సందర్శించి మాతా శిశువు లకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. గ్రామ స్థాయిలో సందర్శనలు జరిపి మాతా శిశు మరణాలు నివారించాలని సూచించారు. వ్యాక్సినేషన్ సమయానికి అందిందించాలని సిబ్బందిని సూచించారు. అనంతరం పి. హెచ్.సిని సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్యసేవలు వైద్యాధికారికి అడిగి తెలుసుకున్నారు. నమోదైన మలేరియా కేసులను అడిగి తెలుసుకున్నారు. హెచ్.బి కిట్స్, ఆర్.డి.టి కిట్స్, మలేరియా నివారణ మందులు, ఓ.ఆర్.ఎస్, అత్యవసర మంపులను, పాముకాటు, కుక్క కాటు వ్యాక్సిన్ లను పరిశీలించారు. ముఖ ఆధారిత అటెండెన్స్ ను పక్కాగా నమోదుచేసుకోవాలని ఆదేశించారు. కరకపుట్టులో ఫ్యామిలీ ఫిజిషియన్ క్యాంప్ ను సందర్శించారు. గ్రామాలలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పి. హెచ్.సి వైద్యాధికారి . రేఖ, యం.పి.హెచ్.ఇ.ఓ బి.లక్ష్మణ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

జిఒ 3కి చట్టబద్ధత కల్పించాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:జిఒ 3 కు చట్టబద్ధత కల్పించిన తర్వాత మెగా డీఎస్సీ ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు పి చిన్నస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, జీఓ 3ను అమలు పరచకుండా ఎన్ని మెగా డీఎస్సీలు భర్తీ చేసినా గిరిజనులకు న్యాయం జరగదని చెప్పారు. దీనిపై టిడిపి, జనసేన, బిజెపి నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు టి.సోమేశ్వరరావు, నిరుద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్ఐ చినబాబు

యువతకు వాలీబాల్ కిట్ వితరణ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని బోర్నగూడెం గిరిజన యువతకు జడ్డింగి ఎస్ఐ చినబాబు మంగళవారం వాలీబాల్ కిట్టు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ చినబాబు మాట్లాడుతూ యువత చదువులతో పాటు క్రీడలపై ఆసక్తి కనబరచాలని, ఉద్యోగ,ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన యువత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విఆర్‌ఒకు ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని రేవళ్ల విఆర్‌ఒ మంగ కుమారి బదిలీపై చింతపల్లి మండలం అన్నవరం పంచాయతీకి వెళ్తున్న నేపథ్యంలో మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ జన్ని నాగేంద్ర మాట్లాడుతూ విఆర్‌ఒ మంగ కుమారి సేవలు మరువలేనివని, 5 సంవత్సరాల నుండి పంచాయతీ ప్రజల్లో తనదైన ముద్ర వేసుకున్నారని తెలిపారు. అన్నవరం పంచాయతీలోనూ మంచిపేరు తెచ్చుకోవాలన్నారు. అనంతరం ఆత్మీయంగా దుస్సాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కొండపల్లి దేముడు, కవిలి సూరిబాబు, లువ్వా వెంకటేశ్వర్లు, బూరుగు లవకుశల, వానపల్లి నాగరాజు, పాగి రామారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సక్రమంగా సేవలు అందించాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : లబ్దిదారులకు సక్రమంగా అంగన్వాడీ సేవలు అందించాలని అంగన్వాడీ కార్యకర్తలను ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ విజయకుమారి ఆదేశించారు. కొయ్యూరు మండలం మర్రిపాలెం, గదబపాలెం, కంఠారం అంగన్వాడీ కేంద్రాలను మంగళవారం ఆమె సందర్శించారు. ఆయా కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలు, బాలింతలు పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-రంపచోడవరం : ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్, జిఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని కన్నారం గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కందుల సాయిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి కన్నారం గ్రామ ప్రజలు వచ్చి వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో కన్నారం బూత్ ఇంఛార్జి ఈకె.నాగన్నదొర, ఐ.పోలవరం బూత్ ఇంఛార్జి కంగల అబ్బాయిదొర పాల్గొన్నారు.

వసతి గృహాల కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-రంపచోడవరం : గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పని చేస్తున్న నాలుగో తరగతి సిబ్బంది సమస్యలపై గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర సంచారకులుకు మంగళవారం వినతి పత్రం సమర్పించినట్లు ఎపి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల నాలుగో తరగతి ఉద్యోగుల ఔట్సోర్సింగ్, డైలీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రామన్న దొర తెలిపారు. ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పనిచేస్తున్న కుక్కులు, కమాటీలు, వాచ్మెన్లు, అటెండర్లకు యూనిఫామ్ ఇవ్వాలని, వసతి గృహాలకు గ్యాస్ సరఫరా చేయాలని, ఏటిడబ్ల్యూఓ ఆఫీసులో ఖాళీగా ఉన్న వాచ్మెన్ కం హెల్పర్లను అటెండర్లుగా మార్చాలని, కుక్కులు, కమాటీ, వాచ్మెన్ యొక్క జాబ్ చార్ట్ ప్రకటించాలని, వారి వీక్లీ ఆఫ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు ఆర్.శివకుమార్, ఉపాధ్యక్షులు డి.తాతాజీ, ప్రధాన కార్యదర్శి పి. చిన్నారెడ్డి, కోశాధికారి పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేయించుకోవాలి

ప్రజాశక్తి-రంపచోడవరం

అర్హులైన పట్టభద్రులు తమ ఓటును నమోదు చేయించుకోవాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ చిరంజీవిరావు అన్నారు. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై మంగళవారం నియోజకవర్గ స్థాయిలోని కూటమి నాయకులతో స్థానిక ఎమ్మెల్యే మిర్యాల శిరీష ఆధ్వర్యాన సమీక్ష సమావేశం రంపచోడవరంలోని కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిరంజీవిరావు మాట్లాడుతూ 2025 మార్చిలో తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయని, దానికి సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 6వ తేదీ వరకు ఓటు నమోదు చేసుకోవాల్సి ఉందని చెప్పారు.

2021 అక్టోబర్ నాటికి డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం, నియోజకవర్గ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబూ రమేష్, కూటమి నాయకులు బొమ్మిడి భారతి, పుర్ల రాజశేఖర్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు

ఆటో బోల్తా పడి ఒకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ శాండికోరి గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారితో మరొకరు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం... జిల్లాలోని వై.రామవరం మండలం బొడ్డ గండి పంచాయతీ పాలగెడ్డ గ్రామానికి చెందిన కిముడు తులావతి, కుమార్తె కిముడు సౌజన్య, మరో యువతి సాగిన మారెమ్మ ముగ్గురు మంగళవారం ఉదయం దారకొండ దారాలమ్మ అమ్మవారిని దర్శించుకొని సీలేరు చేరుకున్నారు. అక్కడ నుండి మరో ఆటోలో పాలగెడ్డ వెళ్తుండగా శాండి కోరి సమీపంలో ఆటో బ్రేకులు పట్టకపోవడంతో అదుపుతప్పి రహదారి పక్కనున్న చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో కిముడు తులావతి తలకి తీవ్ర గాయాలయ్యాయి. కుమార్తె కిముడు సౌజన్య మరో యువతి సాగిన మారెమ్మ ప్రమాదం నుంచి బయటపడ్డారు. బంధువులు సీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి సమాచారం ఇవ్వడంతో అంబులెన్స్‌లో తులావతికి ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. తలకి బలమైన గాయం కావడంతో వైద్యాధికారి ఖాదర్ మస్తాన్ వల్లి, సిబ్బంది తొమ్మిది కుట్లు వేశారు. మెరుగైన వైద్య సేవలను నిమిత్తం చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు.

విశాఖ మీదుగా పలు ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు ఈస్ట్‌కోస్ట్ రైల్వే విశాఖపట్నం - దానాపూర్ - విశాఖపట్నం మధ్య ప్రత్యేక రైలును నడపాలని నిర్ణయించింది. ఈ క్రమంలో 08520 విశాఖపట్నం - దానాపూర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ నవంబర్ 4 సోమవారం ఉదయం 9:10 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి మరుసటి రోజు మంగళవారం ఉదయం 11:00 గంటలకు దానాపూర్ చేరుకుంటుంది. 08519 దానాపూర్ -విశాఖపట్నం స్పెషల్ ఎక్స్‌ప్రెస్ నవంబర్ 5 మంగళవారం మధ్యాహ్నం 12:30 గంటలకు దానాపూర్ నుంచి బయలుదేరి మరుసటిరోజు బుధవారం మధ్యాహ్నం 15:45 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు సింహాచలం, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, బాలుగావ్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, జాజ్‌పుర్‌కియోంజర్ రోడ్, భద్రక్, బాలాసోర్, హిజ్లీ, మిడ్నాపూర్, బంకురా, అద్రా, అసన్సోల్, చిత్తరంజన్, మధుపూర్, జసిడ్హా మీదుగా ప్రయాణిస్తాయి.

అలాగే 08536 విశాఖపట్నం - భువనేశ్వర్ జనసాధరణ ప్రత్యేక రైలు అక్టోబర్ 29 నుంచి నవంబర్ 15 వరకు ప్రతి రోజు మధ్యాహ్నం 12:00 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 19:45 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది. 08535 భువనేశ్వర్ - విశాఖపట్నం జనసాధరణ ప్రత్యేక రైలు అక్టోబర్ 29 నుండి నవంబర్ 15 వరకు ప్రతి రోజు రాత్రి 22:30 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 08:45 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్ళు సింహాచలం, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, పొందూరు, శ్రీకాకుళం రోడ్డు, నౌపడ, పలాస, సోంపేట, ఇచ్ఛాపురం, బ్రహ్మపూర్, ఛత్రపూర్, బాలుగావ్, ఖుర్దా రోడ్డు మీదుగా ప్రయాణిస్తాయని ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ కోరారు.

యువత రక్తదానం చేయాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : యువత రక్తదానం చేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలని రాజవొమ్మంగి ఎస్ఐ నరసింహమూర్తి అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల నేపథ్యంలో రంపచోడవరంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఎస్ఐ నరసింహమూర్తి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి రక్తం ఎంతో దోహదపడుతుందని, రక్తదానం వలన ఎటువంటి అనార్ధాలు ఉండవని, రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని కోరారు.

ఎక్సైజ్ శాఖ లేబొరేటరీ పరిశీలన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రా యూనివర్సిటీలోని ఎక్సైజ్ శాఖ లేబొరేటరీని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం మధ్యాహ్నం పరిశీలించారు. గ్యాస్ క్రోమెటోగ్రఫీ, అటమిక్ అబ్జాప్షన్ స్పెక్ట్రో స్కోపీ, హై పెర్ఫార్మెన్స్ లిక్విడ్ క్రొమెటోగ్రఫీ యంత్రాల పని తీరును గమనించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న మద్యాన్ని తొమ్మిది రకాలుగా పరీక్షిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు.

ఇళ్ల పేరిట మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ధర్నా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇళ్లు ఇస్తామని చెప్పి, డబ్బులు వసూలు చేసిన వైసిపి నాయకులుపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, తక్షణం తగు చర్యలు తీసుకోవాలని సిపిఎం అక్కయ్యపాలెం జోన్ కార్యదర్శి యుఎస్ఎన్.రాజు డిమాండ్ చేశారు. మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్ టౌన్ రంగిరీజు వీధికి చెందిన వైసిపి మాజీ కార్పొరేటర్ కొప్పుల వెంకటరావు కుమారుడు కొప్పుల శ్రీరామ్ తాటిచెట్లపాలెం ఎఎస్ఆర్ నగర్‌కు చెందిన పేదలు వద్ద సుమారు రూ.40 లక్షలను వైసిపి ప్రభుత్వం ఉన్నప్పుడు తీసుకొని మోసం చేశారన్నారు. డబ్బులు ఇచ్చిన నిరుపేదలకు నేటికీ గృహాలు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జి.అప్పలరాజు, పి.గౌరీష్, శోభ, సుశీల, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పిఒ కట్టా సింహాచలం

యువతకు ఉపాధి కల్పించేందుకు ఇంటింటి సర్వే

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలోని గిరిజన యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఇంటింటి సర్వే నిర్వహించడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం అన్నారు. స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్లో అన్ని మండలాలకు చెందిన సచివాలయాల సిబ్బందికి మంగళవారం నైపుణ్య గణనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న పిఒ సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీలోని ఇంటింటి సర్వే ద్వారా నైపుణ్యాభివృద్ధి అర్హత ఉన్న 16 నుండి 59 సంవత్సరాల వయసు గల వారిని గుర్తించడం జరుగుతుందని చెప్పారు. స్కిల్ సెన్సెస్ సర్వే కొరకు సచివాలయాన్ని ఒక యూనిట్‌గా తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎంపీడీవోలను కోఆర్డినేటర్లుగా నియమించడం జరుగుతుందని తెలిపారు. జనావాసాలను కస్టర్లుగా విభజించి ఒక్కొక్క క్లస్టర్‌లో ఎన్యుమనేటరును నియమించడం జరుగుతుందని చెప్పారు. ప్రతి ఎన్యుమనేటర్ నిర్దిష్ట కుటుంబాలను మ్యాపింగ్ చేయాలన్నారు. ఈ ఇంటింటి సర్వేకు వచ్చిన అధికారులు, సిబ్బందికి ఆయా ప్రజలు తోడ్పాటును అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కో-ఆర్డినేటర్ దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధి కల్పన అధికారి సతీష్, యూత్ ట్రైనింగ్ మేనేజర్ సుదీష్, కోఆర్డినేటర్లు కళ్యాణి, ఆనంద్, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-సీలేరు : గ్రామాల్లో సమస్యలను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామని జనసేన పార్టీ అరుకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్ల వీర వెంకట్ అన్నారు. మండల కేంద్రం జీకే వీధి పంచాయతీ పరిధి గొందిపల్లి గ్రామంలో మంగళవారం జనసేన నాయకులు పర్యటించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీర వెంకట్ మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో గత ప్రభుత్వ హయాంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సోషల్ మీడియా ఇన్ఛార్జి కొయ్యం ఇమ్మానియేల్, సిద్దు, బూత్ కన్వీనర్ గడుతురు పరమేశ్వరరావు, నాడీల్ సత్యారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి మేట్టడం వెంకటేష్, యూత్ అధ్యక్షులు పాంగి చంటిబాబు, వంతల రాజు, గ్రామ పెద్దలు దేశిగిరి పడ బాలరాజు, పెద్దబ్బాయి రామకృష్ణ, వెంకటేష్, దేశగిరి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక విద్యా బోధనపై శిక్షణ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : టీచ్ ఆఫ్ రైట్ లెవెల్ అనే కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులకు ఆధునిక విద్యా బోధన అంశాలపై స్థానిక ఎంఆర్సి కార్యాలయంలో మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు లెక్కలు, తెలుగు బోధించే ఆధునిక విద్యాబోధనపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఈఓ కె సత్యనారాయణదొర మాట్లాడుతూ ఈ అవకాశాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ2 సూరారెడ్డి పలు పాఠశాల ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఆర్‌టిసి విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆర్‌టిసి రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆర్‌టిసి రీజనల్ మేనేజర్ కార్యాలయం వద్ద ఆర్‌టిసి రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వి.తులసీరామ్ మాట్లాడుతూ 2020 తర్వాత రిటైర్ అయిన వారికి రావలసిన డబ్బులు వెంటనే ఇవ్వాలన్నారు. రిటైర్ అయిన వారికి కనీస పెన్షన్ రూ.1000 మాత్రమే ఇస్తున్నందున రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వారికి వర్తించే విధంగా చూడాలని కోరారు. అనంతరం ఇన్‌ఛార్జి ఆర్‌టిసి జిల్లా మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఇఎస్.నారాయణ, ఎస్.తాజుద్దీన్, ఎస్.జగదీష్, వీరభద్రరావు, జోషీబాబు పాల్గొన్నారు.